

ధీమా ఇవ్వని బీమా

పశు బీమా పథకం ఐదేళ్లుగా నిలిచిపోవడంతో జీవాలను కోల్పోయిన రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. 8లో▸



గ్యాస్ ధర తగ్గింపు..

వంట గ్యాస్ ధర తగ్గించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు అన్నారు. 8లో▸



ఈ ఊర్లకు దార్లేవి?

బొంరాస్‌పేట మండలంలో రోడ్లు సరిగ్గా లేని గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



మంత్రి మహేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి నర్మద



తమ్ముడు నర్సింహారెడ్డికి రాఖీ కడుతున్న విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

రాఖీ.. రక్ష

రాఖీ పౌర్ణమి పండుగను జిల్లా వాసులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు, యువతులు, బాలికలు వారివారి సోదరులకు రాఖీ కట్టి మీరే మాకు రక్ష అని కోరారు. వారు సైతం అక్కాచెల్లెళ్లకు స్వీట్లు తినిపించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పండుగ నేపథ్యంలో ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.



పరిగి: సోదరులకు రాఖీలు కడుతున్న చిన్నారులు

న్యూస్‌రీల్

భక్తిభావం పెంపొందించుకోవాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆర్ కృష్ణయ్య తదితరులు

మోమిన్‌పేట: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాళ్లగుడుపల్లి హనుమాన్ మందిరంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పట్నంను కలిసిన ఎమ్మెల్యే ఆనంద్



మంత్రికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి సన్మానించారు. మంత్రిని కలసిన వారిలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అనంతుని సేవలో ప్రముఖులు



స్వామివారి సన్నిధిలో సైదా, లింగ్యా నాయక్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రభుత్వ అదనపు కార్యదర్శి (మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ శాఖ) వి.సైదా, జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు వీరికి జ్ఞాపికలు అందజేశారు.

విఘ్నాలు తొలగేనా..?

జిల్లాలో నిలిచిపోయిన రెండు భారీ ప్రాజెక్టులు

- నేవీ, ఫైరింగ్ రేంజ్ ఏర్పాటులో కానరాని పురోగతి
- ఇప్పటికే స్థల పరిశీలన పూర్తి
- మూడేళ్ల క్రితమే నేవీకి మెజారిటీ అనుమతులు
- నేటికీ ప్రారంభంకాని పనులు
- తరలిపోతాయా అనే అనుమానాలు



పూడూరు మండలం దామగుండం సమీపంలో నేవీ రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు కేటాయించిన భూమి

వికారాబాద్: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పూడూరు మండలం దామగుండం ప్రాంతంలో రెండు భారీ ప్రాజెక్టులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ ప్రాంతంలో మూడు భారీ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉండగా అందులో రెండు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సినవి. పూడూరు పరిసరాల్లో నేవీ రాడార్ వ్యవస్థ, రక్షణ శాఖకు సంబంధించిన ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం స్థల పరిశీలన కూడా పూర్తి చేశారు. వీటితో పాటు ఇదే ప్రాంతంలో పారిశ్రామిక వాడ నిర్మాణ పనులు సైతం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పారిశ్రామిక వాడ పనులు వేగంగా సాగుతున్నాయి. నేవీ రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి భూముల కేటాయింపు కూడా పూర్తయింది. అయితే కేంద్రంతో పొసగక రాష్ట్ర ప్రభుత్వమే విఘ్నాలు కలిగిస్తోందని బీజేపీ నేతలు అంటున్నారు.

స్థల పరిశీలనకే ఫైరింగ్ రేంజ్

నగరంలోని కంటోన్మెంట్, ప్యాట్నీ, ప్యారడైజ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమించేందుకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాంత భూముల్లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఫైరింగ్ రేంజ్ కొనసాగుతుండడం అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఆ భూములు తమకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పలు మార్లు చర్చలు జరుపుతూ వచ్చింది. మూడేళ్ల క్రితం ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు కేంద్ర రక్షణ శాఖ అంగీకరించింది. అయితే ప్రత్యామ్నాయంగా ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు భూములు కేటాయించాలని షరతు విధించింది. దీంతో ఆ శాఖకు జిల్లాలోని పూడూరు మండలంలో భూములు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. మండలంలోని రాకంచర్ల, తిర్మలాపూర్ తండా, సోమన్‌గుర్తి గ్రామాలతో పాటు పరిగి మండలం నస్కల్ గ్రామాల మధ్య ఉన్న అటవీ భూములను రక్షణ శాఖ అధికారులకు చూపించారు. 120 నుంచి 124 సర్వే నంబర్లలో 1,145 హెక్టార్ల అటవీ భూములు ఉన్నాయి. వాటిలో 700 పైచిలుకు ఎకరాలను రక్షణ శాఖకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. అప్పటి కలెక్టర్ దివ్య రక్షణ శాఖ అధికారులకు ఆ భూములను చూపించారు. నగరంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న 135 ఎకరాల భూములకు బదులుగా పూడూరు మండలంలో 700 ఎకరాల ఫారెస్టు భూములను ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. రక్షణ శాఖ అధికారులు సైతం ఇక్కడ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. ఆ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన సంబంధాలు లేకపోవడంతో ఆ ప్రతిపాదన ముందుకు కదలలేదు.

అన్నీ అనుకూలంగా ఉన్నందునే..

పూడూరు ప్రాంతం నగరానికి సమీపంలో ఉండడం, ఇక్కడ అటవీ, ప్రభుత్వ భూములు ఉండడం వంటి సానుకూల అంశాల నేపథ్యంలో ఇక్కడ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు ఆ శాఖ సుముఖత వ్యక్తం చేసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో 130 ఎకరాల్లో పారిశ్రామిక వాడ నిర్మాణ పనులు ప్రారంభం కావడం, 2,700 ఎకరాల్లో నేవీ రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, 700 పైచిలుకు ఎకరాల్లో రక్షణ శాఖ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు అయితే పూడూరు దశ మారిపోతుందని స్థానికులు భావించారు. నేవీ రాడార్ ఏర్పాటుకు అవసరమైన భూములను జిల్లా అధికారులు మూడేళ్ల క్రితమే ఆ శాఖకు కేటాయించారు. దీంతో రూ. 1,900 కోట్లతో 2,700 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే గడిచిన రెండేళ్లుగా నేవీ రాడార్ ప్రాజెక్టు, ఫైరింగ్ రేంజ్ ప్రాజెక్టుల విషయంలో కేంద్రం ఊసే ఎత్తడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టులు ఇక్కడ ఏర్పాటు చేస్తారా లేకుంటే ఇతర ప్రాంతాలకు తరలిస్తారా అనే అనుమానం స్థానికుల్లో నెలకొంది.

అగ్రిమెంట్.. ఆందోళన

- తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుడి ఆత్మహత్యా యత్నం
- పెట్రోల్ డబ్బాను లాక్కున్న పోలీసులు
- బాధితుల నిరసనతో టెన్షన్ వాతావరణం
- అధికార పార్టీ నేతలు, పోలీసుల తీరుపై గిరిజనుల మండిపాటు

పరిగి: భూ రిజిస్ట్రేషన్‌తో తమకు అన్యాయం జరిగిందంటూ ఓ గిరిజన వ్యక్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నజీరాబాద్‌తండాకు చెందిన మేగరాజు, సుదర్శన్.. రాఘవపూర్‌లో 22 ఎకరాల భూమి కొనుగోలు కోసం అగ్రిమెంట్ చేసుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన వెంకట్‌రాములు నుంచి సర్వేనంబర్ 94, 95, 96లోని భూమి కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. కొంత మేర డబ్బులు చెల్లించిన అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా భూమి హక్కులను పరిశీలించగా ప్రొహిబిటెడ్ (సీలింగ్) జాబితాలో ఉందని తెలుసుకున్నారు. ఆరోజు నుంచి అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగి.. కష్టనష్టాలను భరించి మొత్తానికి నిషేధిత జాబితా నుంచి పట్టా భూమిగా మార్పించారు. ఇది గమనించిన భూ విక్రయదారుడు వెంకట్‌రాములు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్‌కు చెందిన భాస్కర్‌రెడ్డికి ఎక్కువ ధరకు విక్రయించాడు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న మేగరాజు, సుదర్శన్.. తమకు అగ్రిమెంట్ చేసిన భూమిని ఇతరులకు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తావని అడిగేందుకు చాలాసార్లు ప్రయత్నించినా.. వెంకట్‌రాములు అందుబాటులోకి రాలేదు. దీంతో సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరుతూ.. తమ న్యాయవాది ద్వారా తహసీల్ కార్యాలయానికి నోటీసులు అందించారు. అయినప్పటికీ గురువారం వెంకట్‌రాములు.. భాస్కర్‌రెడ్డికి భూమి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం తెలిసిన బాధితులు పెద్దసంఖ్యలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు అన్యాయం జరిగిందని రోదిస్తూ.. బాధితుడు సుదర్శన్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నం చేశారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు అతడి చేతిలో నుంచి పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, గిరిజనుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు ఆందోళనకారులను అక్కడినుంచి వెళ్లగొట్టారు.

అధికార పార్టీ నేతల హస్తం..

ఈ వ్యవహారం మొత్తం స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతోనే సాగుతోందని బాధితులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాల్సిన నేతలు, పోలీసులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో వికారాబాద్, పరిగి పీఎస్‌లలో తమపై తప్పుడు కేసులు బనాయించారని తెలిపారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. సదరు భూమిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కలెక్టర్‌ను కోరినట్లు తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకారులను అదుపు చేస్తున్న పోలీసులు



శోభాయమానంగా పాంబండ గిరి ప్రదక్షిణ

కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో గురువారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం శోభాయమానంగా సాగింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పలు గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

– కుల్కచర్ల

ఎన్నికల వేళ.. నిరసనల జ్వాల

- హక్కుల సాధనకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె బాట
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- జిల్లా కేంద్రంలో ఆందోళనలు
- నేటి నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వికారాబాద్ అర్బన్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు హక్కుల సాధనకు పోరుబాట పట్టారు. ఇదే సరైన సమయమని భావించిన వారు రెండు నెలల నుంచి తరచూ రోడెక్కి వారి డిమాండ్లను ప్రభుత్వానికి వినిపిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో రోజూ ధర్నాలు, ర్యాలీలు జరుగుతూనే ఉన్నాయి. కలెక్టరేట్ ఎదుట నిత్యం నిరసన గళాలు వినిపిస్తూనే ఉన్నారు.

కొన్ని శాఖల ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ వస్తోంది. నాలుగు నెలల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేసింది. ఆ తరువాత మెప్మాలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. ఎన్నో ఏళ్లుగా పే స్కేల్ కావాలంటూ పోరాటం చేస్తున్న వీఆర్‌ఏలను కూడా ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఎవరూ ఊహించని విధంగా ఆర్టీసీ ఉద్యోగులను సైతం ప్రభుత్వంలో విలీనం చేసుకుంది. ఇలా పలు శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది పట్ల ప్రభుత్వం సానుకూలత ప్రదర్శిస్తుండడంతో మిగతా శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు మొదలు పెట్టాయి.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

రెండు దశాబ్దాలుగా మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం 8 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు పోనున్నట్లు నోటీసు కూడా ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లుతో పాటు ఇతర విభాగాల్లో పనిచేసే వారు సమ్మెలో పాల్గొంటే పాలన పూర్తిగా స్తంభించే అవకాశం ఉంది. వికారాబాద్ మున్సిపాలిటీలో 243 మంది, తాండూరులో 285 మంది, పరిగిలో 105, కొడంగల్‌లో 80 మంది కార్మికులు సమ్మె బాట పట్టనున్నారు.

ఇప్పటికే సమ్మెలో సెకెండ్ ఏఎన్‌ఎం

పనికి తగ్గ వేతనంతో పాటు, పై అధికారుల వేధింపులు మానుకోవాలని, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని రద్దు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా 180మంది సెకెండ్ ఏఎన్‌ఎంలు 20 రోజులుగా సమ్మె చేస్తున్నారు. నిత్యం కలెక్టరేట్ కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసనలు తెలుపుతున్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎన్నికల సమయం కావడంతో ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేరుస్తుందనే నమ్మకంతో గట్టి పోరాటం చేస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన

జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న 650 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఆగస్టు 29 నుంచి సమ్మెకు దిగారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వీరి సమ్మె కారణంగా మండల వనరుల కార్యాలయాల్లో పనులు ఆగిపోయాయి. దీంతో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

వెట్టి చాకిరీ చేయిస్తున్నారు



ఏఎన్‌ఎంలతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోంది. రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నా ప్రభుత్వం తమ సేవలను గుర్తించడం లేదు. ఇప్పటికైనా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– లీలావతి, యునైటెడ్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

పర్మినెంట్ చేయాలి



మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న సీఎం కేసీఆర్ మాట నిలపుకోవాలి.

– చిన్నయ్య, మున్సిపల్ కార్మికుల సంఘం వికారాబాద్ అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత లేదు



ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో వారి కంటే ఎక్కువ సమయాన్నే కేటాయిస్తున్నాం. అయినా మా శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, కనీస వేతనం అమలు చేయాలి.

– స్వప్నరెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు

బీఈడీ పరీక్ష రాసేందుకు వచ్చి..

- ప్రమాదవశాత్తు ఇటుకలు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- పరిగి పల్లవి కళాశాలలో ఘటన



ఆస్పత్రిలో అనితను పరామర్శిస్తున్న ఎస్‌ఎస్‌యూఐ నాయకులు

పరిగి: బీఈడీ ఫైనల్ సెమిస్టర్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థినులపై ప్రమాదవశాత్తు ఇటుకలు పడడంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పరిగి పల్లవి కళాశాలలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరుకు చెందిన అనిత అక్కడి వెంకటేశ్వర కళాశాలలో బీఈడీ చేస్తోంది. ఫైనల్ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు స్నేహితులతో కలసి పరిగి పట్టణంలోని పల్లవి కళాశాలకు వచ్చింది. పరీక్షకు సమయం ఉండడంతో చెట్టు కింద కూర్చున్నారు. పక్కనే ఉన్న శారద ఆస్పత్రి పైభాగంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడి నుంచి ఇటుకలు విద్యార్థినులపై పడ్డాయి. దీంతో అనిత తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తోటి విద్యార్థులు పరిగి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఎస్‌యూఐ నేతలు నాగవర్ధన్, మరి కొందరు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. బీఈడీ ఫైనల్ సెమిస్టర్ చివరి పరీక్ష కావడంతో అనిత పరీక్ష రాయాలని పట్టుబట్టింది. ప్రథమ చికిత్స అనంతరం కళాశాలకు వచ్చింది. అప్పటికే పరీక్ష ప్రారంభం కావడంతో కళాశాల సిబ్బంది కేంద్రంలోకి అనుమతించలేదు. అనిత ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎస్‌యూఐ నేతలు అక్కడి చేరుకొని అధ్యాపకులకు సర్ది చెప్పి అనితతో పరీక్ష రాయించారు.

లైవ్ జిల్లా కార్యదర్శిగా రాజు



యాలాల: లంబాడాల ఐక్య వేదిక(లైవ్) జిల్లా కార్యదర్శిగా రాజు రాథోడ్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని లైవ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్, రాష్ట్ర సమన్వయకర్త రమేష్ నాయక్ అందజేశారు. రాజు మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

ధీమా కల్పించని బీమా

వ్యవసాయంపై పెట్టిన బదులు చేతికొస్తాయో? పూర్తిగా మునిగిపోతోయే కచ్చితంగా తెలియని దయనీయ స్థితిలో ఉన్న అన్నదాతలకు పాడి పరిశ్రమ అండగా నిలిచేది. ఏదైనా ప్రమాదం జరిగి పశుసంపద కోల్పోతే.. సర్కారు బీమా అందజేసి ధీమాగా నిలిచేది. కానీ ఐదేళ్లుగా ఆ సౌకర్యం నిలిచిపోవడంతో కష్టాల కడలిలో కర్షకులు కొట్టుమిట్టాడుతున్న వైనంపై 'సాక్షి' కథనం..

ఐదేళ్లుగా పథకానికి బ్రేక్
- పశువుల మృతితో నష్టపోతున్న పాడి రైతులు
- రాయితీ స్కీంను కొనసాగించాలంటున్న కర్షకులు
- జిల్లాలో పశు సంపద 2,72,700



కొట్టంలో పశువులు

పరిగి: పాడి పశువులకు ఏదైనా ప్రమాదం సంభవించి, అవి చనిపోతే రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం పాడి పశువులకు బీమా పథకాన్ని తీసుకువచ్చింది. రైతులు తమ దగ్గర ఉన్న పశువులకు బీమా చేసుకునేందుకు కొంత డబ్బును చెల్లిస్తే.. సర్కారు మిగతా సొమ్మును చెల్లించి బీమా కల్పించేది. కానీ.. నేడు ఆ పథకం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

కర్షకుల కన్నీటి పర్యంతం

ఏదైనా రోగం, విద్యుదాఘాతం, పిడుగుపాటు, రోడ్డు ప్రమాదాలతో పశువులు మృత్యువాత పడి రైతుకు అపార నష్టం కలుగుతోంది. బీమా సౌకర్యం లేక.. అప్పోసప్పో చేసి రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పాడిపశువులు ఇలా అర్ధంతరంగా చనిపోవడంతో దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం మేలు రకం జాతీ పశువులను కొనాలంటే సుమారు లక్ష వరకు వెచ్చించాల్సి ఉంటుంది. వ్యవసాయ పనులు లేని సమయంలో రైతులు ఈ పశువులతో పాల ఉత్పత్తి చేసి ఆర్థికంగా బలోపేతం చెందేవారు. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రమాదాల బారిన పడి పశుసంపద కోల్పోతే కుంగుబాటుకు గురై.. కన్నీటి పర్యంతం అవుతున్నారు.

ఐదుళ్లుగా..

పాడి పశువులకు బీమా పథకం 2017–18వరకు అమలైంది. అంతకు ముందు కూడా అడపాదడపా ఈ స్కీంను ఉండేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని పట్టించుకోక పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇలా చాలా ప్రాంతాల్లో రోగాలతో పాటు విద్యుదాఘాతంతో పాడి పశువులు ఎన్నో మృత్యువాత పడి రైతులకు అపారం నష్ట మిగుల్చుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బీమా సౌకర్యం కొనసాగించాలని రైతన్నలు కోరుతున్నారు.

జిల్లాలో 2.7 లక్షల పాడి పశువులు

జిల్లాల్లో అధిక రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు కుటుంబం ఒకటి రెండు చెప్పున పాడి పశువులను సాకుతూ జీవనోపాధి పొందుతున్నారు. మొత్తంగా పాడి రంగాన్ని ఎంచుకున్న వారే అధికంగా ఉన్నారు. జిల్లాలోని 19 మండలాలతో కలిపి మొత్తం 2,72,700 పశువులు ఉన్నాయి. అందులో ఆవులు 1,82,700, బర్రెలు 90వేలు ఉన్నాయి. వీటి నుంచి నిత్యం 45వేల లీటర్ల పాల ఉత్పత్తిని రైతులు సాధిస్తున్నారు.

ధీమా కోల్పోయిన రైతులు

పాడి రంగాన్ని నమ్ముకున్న అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. గత ప్రభుత్వాల హయాంలో పాడి పశువులకు, దూడలకు బీమా కల్పించడంతో రైతన్నలు . ధీమాగా ఉండేవారు. వారి వాటా రుసుం చెల్లించి బీమా చేయించుకునేవారు. కానీ ఐదేళ్లుగా ఎలాంటి బీమా సౌకర్యం ప్రభుత్వం అందించకపోవడంతో పాడి పశువులు మృత్యువాత పడిన ప్రతిసారి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రైవేటు బీమాకు అధిక రుసుం



పశువులకు ప్రైవేటులో బీమా చేయించాలంటే చాలా డబ్బులు ఖర్చు అవుతోంది. దీంతో రైతులు ఎవరూ కూడా ఇన్సూరెన్స్ చేయించుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన బీమా అయితే తక్కువ ప్రీమియం ఉంటుంది. ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో పశువులకు ఎన్నో రోగాలు చుట్టుముట్టడంతో అవి మృత్యువాత పడుతున్నాయి. కావున ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలి.
– రవికుమార్, పాడి రైతు మోత్కూర్

ఎలాంటి ఇన్సూరెన్స్ లేదు



మహిళా సమాఖ్య, బ్యాంకుల ద్వారా తీసుకున్న పాడి పశువులకు మాత్రమే బీమా సౌకర్యం ఉంది. రైతుల దగ్గర ఉన్న, కొత్తగా కొన్న పశువులకు ఎలాంటి బీమా పథకం అందుబాటులో లేదు. గతంలో బీమా పథకం ఉండేది. అందులో బీమా ఎంత చేయించుకుంటే అంత రైతు వాటా, ప్రభుత్వం వాటా డబ్బు చెల్లించి బీమా చేసేవారు.
– డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, వికారాబాద్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- అర్హులందరికీ సంక్షేమ పథకాల పంపిణీ
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఫాంహౌస్‌లో వివిధ గ్రామాలకు చెందిన 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు దేవనోనిగూడ వెంకటయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, దేశంలోనే బీఆర్ఎస్‌కు మెజార్టీ సభ్యత్వాలు ఉన్నాయన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. అర్హులందరికీ సంక్షే పథకాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అజీం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సర్పంచ్‌లు బుచ్చన్న, వినోద్‌గౌడ్, రాంరెడ్డి, ముక్కంటి, లక్కం సత్యనారాయణ, నీరటి నర్సింహులు, వెంకటయ్య, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌ఐ అభ్యర్థులకు సన్మానం

అనంతగిరి: వికారాబాద్ జిల్లా నుంచి ఎంపికైన పోలీసు అభ్యర్థులకు శనివారం ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ బస్‌డిపో ఎదుట ఓ ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని వికారాబాద్ జిల్లా డెవలప్ మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, రాష్ట్ర కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. జిల్లా నుంచి 47 మంది ఎస్సైలుగా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమాన్ని అభ్యర్థులతో పాటు, డెవలప్ మెంట్ ఫోరం ప్రతినిధులు, తెలంగాణ, వికారాబాద్ జిల్లా, జోన్ మార్పిడి కోసం పోరాటం చేసిన వారందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

పంటలు ఎండే.. గుండెలు మండే!

- ముఖం చాటేసిన వరుణుడు
- దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న
- వాడిపోతున్న కంది
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

ధారూరు: నెల రోజులుగా వానలు కురవకపోవడంతో మొక్కజొన్న పూర్తిగా ఎండిపోగా, పత్తి పంట ఎదుగుదల ఆగిపోయింది. ధారూరు మండలంలో వరి 3,491 ఎకరాలు, మొక్కజొన్న 1,900, పత్తి 9,000, కంది 3,924, పెసరా 180 ఎకరాల్లో ఇతర పంటలు మరో 5వేల ఎకరాల్లో సాగుచేశారు. నెల రోజుల నుంచి వానలు ముఖం చాటేయడంతో వేసిన పంటలు రైతుల కళ్ల ముందే ఎండి పోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడి చేతికందే పరిస్థితి లేకుండా పోయిందని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

మండుతున్న ఎండలు

ఏ ఒక్క రోజైనా వాన పడకపోతుందా? అని రైతులు గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నారు. చుక్కనీరు పడకపోవడంతో వారంతా హతాశులయ్యారు. ప్రస్తుతం ఎండాకాలాన్ని తలపిస్తున్నట్లు ఎండలు కొడుతున్నాయి. ఇలాంటి వాతావరణంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అడపాదడపానైన వానలు కురిస్తే పంటలకు జీవం పోసినట్లయ్యేదని వారు చెబుతున్నారు. ఈ క్రమంలో చుక్క వర్షం పడకపోవడంతో మొక్కజొన్న పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన చెందుతున్నారు.

ఆశ వదులుకోవాల్సిందే..

వానలు లేకపోవడంతో పత్తి ఎదుగుదల ఆగిపోయిందని, కేవలం ఒక్క ఫీట్ ఎత్తులో పెరిగినా పత్తి మొక్కకు అక్కడక్కడ పూలు పూయడం, అవి క్రమంగా వాడిపోవడంతో రైతులు భయాందోళనల చెందుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పత్తి చేతికి రాకుండా పోతుందని వారు భయపడుతున్నారు. కంది పటలకు మరో వారం రోజుల్లో వానలు పడకపోతే అవి పూర్తిగా ఎండిపోతాయి. రెండు, మూడు రోజుల్లో వానలు పడకపోతే సాగుచేసిన ప్రధాన పంటలపై ఆశ వదులుకోవాల్సి ఉంటుందని వారు ఆందోళన చెందుతున్నారు.



అల్లీపూర్‌లో ఎదుగుదల ఆగిపోయిన పత్తి పంట

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- భగీరథ నీటి సరఫరాకు చర్యలు
- పాఠశాల భవన నిర్మాణానికి రూ.5కోట్లు
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



బొంరాస్‌పేట: ఎమ్మెల్యేకు సమస్యల గురించి వివరిస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: పాడుబడిన ఇళ్లను తొలగించి, బావులపై పైకప్పులు ఉంచాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. 'మనఊరు-మనఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం ఉదయం 8గంటలకు బొంరాస్‌పేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీలను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని, మిషన్ భగీరథ నీరు సరఫరా కావటం లేదని, పైప్‌లైన్ పనులను చేపట్టి, గేట్‌వాల్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల అదనపు గదులు, వంట గదులను పరిశీలించారు. స్థానిక ఎస్‌బీఐని సందర్శించి రుణమాఫీ పథకం అమలులో రైతులకు ఇబ్బందులు పెట్టొదన్నారు.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు

బురాన్‌పూర్ గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి రూ.5కోట్లు, రోడ్డు డివైడర్ వీధిలైట్ల ఏర్పాటుకు రూ.2కోట్ల నిధులు ప్రతిపాదనలు పంపామని, త్వరలో మంజూరవుతాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమిబాయి, ఎంపీఓ పాండునాయక్, దేశ్యానాయక్, శేరి నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి శ్రావణ్, మహేందర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

కొడంగల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ మున్సిపల్ పరిధి 30 మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కౌన్సిలర్ మధుసూదన్‌రావ్, మాల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, మండల కమిటీ అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో క్యాంపు కార్యాలయంలో అధికార పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు ఆహ్వానించారు.

మరోసారి అధికారం..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ మండలం పీలారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మరోసారి పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించడం హర్షణీయం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం అనంతరం మాట్లాడుతున్న నేతలు

రాష్ట్ర ప్రభుత్వం పన్నులు తగ్గిస్తే.. మరింత అగ్గువ
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు

కుల్కచర్ల: మహిళల ఇబ్బందులను గ్రహించి కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.200 తగ్గించడం హర్షణీయమని, రాష్ట్ర పన్నుల శాతం తగ్గిస్తే మరింత తగ్గే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రం ప్రధాన చౌరస్తాలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు ఇప్పటికైనా బీఆర్ఎస్ సర్కారు చెబుతున్న గొప్పలను గమనించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, ఎస్సీమోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు సంతోష్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు: ప్రధాని నరేంద్రమోదీ పేద మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించడం హర్షణీయమని బీజేపీ వికారాబాద్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత అన్నారు. తాండూరు పట్టణంలోని గాంధీ చౌక్ కూడలిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అర్చన, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు రేణుక, జిల్లా అధికార ప్రతినిధి శృతి, బంటారం భద్రేశ్వర్, తదితరులున్నారు.



తాండూరులో.. మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళామోర్చా ప్రతినిధులు

రవీంద్రభారతిలో ప్రపంచ జానపద దినోత్సవం

బొంరాస్‌పేట: ప్రపంచ జానపద దినోత్సవాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం నిర్వహించారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నుంచి వివిధ కళాకారులు పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. కళాకారులను ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య తదితరులున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సీఐ

కొడంగల్ రూరల్: పలు దొంగతనాలకు పాల్పడిన ఓ దుండగున్ని గురువారం సీసీఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. సీఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సిలెరి కోట్రికె గ్రామానికి చెందిన సంజీవ్ కొడంగల్‌లో రెండు దుకాణాలు, కోస్గిలో ఒక దుకాణం, కర్ణాటక ముదేళి గ్రామంలో రెండు షాపుల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. గురువారం పట్టణంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు సంజీవ్ తడబడుతూ మాట్లాడటంతో అనుమానం ఆరా తీయగా.. దొంగతనం వివరాలు వెల్లడయ్యాయి. నిందితుడు సంజీవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మందుబాబుల దాష్టీకం

- వీధిలో మద్యం ఎందుకు సేవిస్తున్నారని ప్రశించిన యువకుడిపై కత్తులతో దాడి



గాయాలపాలైన యువకుడు

తాండూరు: వీధిలో మద్యం ఎందుకు సేవిస్తున్నారని ప్రశ్నించినందుకు ఓ యువకుడిపై నలుగురు మందుబాబులు కత్తులతో దాడి చేసిన సంఘటన తాండూరు పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం గొల్ల చెరువు ప్రాంతానికి చెందిన సల్మాన్ తన సోదరితో కలిసి మార్కెట్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్ల చెరువు వీధిలో నలుగురు యువకులు రోడ్డుపైనే మద్యం సేవిస్తున్నారు. రోడ్డుపై ఎందుకు మద్యం తాగుతున్నారంటూ సల్మాన్ యువకులను ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులపై యువకులు ఇంట్లో ఉన్న కత్తులను తీసుకు వచ్చి సల్మాన్‌పై దాడి చేసి పారిపోయారు. విషయం గమనించిన స్థానికులు గాయాలపాలైన యువకుడిని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట ఆసుపత్రిలో వైద్యం చేయించుకోండని, ఉదయం వివరాలు తీసుకుంటామని పోలీసులు బాధితుడికి తెలిపారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. పది రోజులుగా తమ డిమాండ్ల సాధనకై సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానన్న కేసీఆర్.. ఇప్పుడు మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో చందర్ సింగ్, తుల్జారామ్, చిన్నయ్య, నాగేందర్ రెడ్డి, మిర్జా, గోపాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు